

వర్షాకాలం.. పాములతో.. జరభద్రం

● నాటు వైద్యాన్ని నమ్మకోవద్దు ● అందుబాటులో మందులు



వర్షాకాలం ప్రారంభమైంది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం పనుల్లో బీజీ అయ్యారు. మరోవైపు ఇది పాములకు అనువైనకాలం. జూన్, జూలై నెలల్లో పాములు తమ ఆవాసాలను విడిచి బయటకు వస్తుంటాయి. ఈ క్రమంలో పొలం పనులకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

\- ఆసిఫాబాద్

వర్షాకాలంలో పాముల బెడద అధికంగా ఉంటుంది. కానీ భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. చల్లదనానికి పాములు వాటి ఆవాసాల నుంచి బయటకు వస్తాయి. రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల్లో సంచరిస్తూ ఇండ్లలోకి ప్రవేశిస్తాయి. వానాకాలం పంట సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న సమయంలో పాములు బయటకు రావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి ఏటా పాము కాటుకు గురై ఎంతో మంది మృతి చెందుతున్నారు. కట్ల పాము కాటేసిన క్షణాల్లో విషం రక్తంలోకి ప్రవేశించి మృతిచెందే అవకాశం ఉంటుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఆందోళనకు గురికాకుండా వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. నాగు పాము కాటేసిన 15 నిమిషాల్లో విషం ఎక్కుతుంది. రక్తపింజర కాటేసిన రెండు గంటల తరువాత విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, సిరుకట్ల పాము కాటేసినా విషం ఉండదు. అయితే కాటేసిన చోట చికిత్స చేయడానికి ఆసుపత్రులకు తీసుకువెళ్లాలి. పాములు ఎన్నో రకాలు ఉంటాయి. ఏ పాము కాటే వేస్తే ఆందోళనకు గురి కాకుండా కాటేసిన దగ్గర కట్టుకట్టి ఆసుపత్రికి తీసుకు వెళ్లాలి.

పీహెచ్‌సీల్లో మందులు

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 22 పీహెచ్‌సీలు ఉన్నాయి. రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలలో పాముకాటు మందులు అందుబాటులో ఉన్నాయి. ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో సంప్రదించే అవసరం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే జిల్లా ఆసుపత్రులకు తరలించి కృత్రిమ శ్వాసను అందించి బతికించే అవకాశం ఉంటుంది. ఆందోళనకు గురై ఆలస్యం చేస్తే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

ఆందోళన అవసరం లేదు

పాము కాటుకు గురైనప్పుడు ఆందోళనకు గురి కావద్దు. ఇది గుండెపోటుకు దారితీస్తుంది. ప్రాథమిక చర్యగా కాటువేసి ప్రదేశంపై భాగంలో కట్టు కట్టాలి. ఆ వెంటనే చికిత్స కోసం వెళ్లాలి.

మంత్రగాళ్లను ఆశ్రయించొద్దు

గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు ఎక్కువ. వైద్యులను సంప్రదించకుండా మంత్రగాళ్లను ఆశ్రయిస్తుంటారు. పాము కాటుకు వైద్యం ఉంది. పాము కాటుకు గురైన వారు మంత్రగాళ్లను ఆశ్రయించవద్దు. ఆశ్రయిస్తే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

అన్ని పీహెచ్‌సీలలో మందులు అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ సుధాకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



జిల్లాలోని 22 పీహెచ్‌సీలలో పాము కాటుకు సంబంధించి (యాంటీ స్నేక్‌వీనం) ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీల సిబ్బందిని అప్రమత్తం చేశాం. వర్షాకాలం కావడంతో పాములు సంచరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రైతులు, కూలీలు వ్యవసాయ పనుల చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పాము కాటుకు గురైన వ్యక్తులను నేరుగా ఆసుపత్రులకు తరలించాలి. మూఢనమ్మకాలు నమ్మి సమయం వృథా చేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

పాము కాటు లక్షణాలు

వ్యక్తిని విషపూరితమైన పాము కాటేస్తే శరీరమంతా నీలం రంగుగా మారడం, రక్త పోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో దద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి నురగా వస్తుంటుంది. ఆయాసపడి చెమటలు పట్టి ఉంటే సాధారణ స్థాయి కంటే రెట్టింపు స్థాయిలో గుండె కొట్టుకుంటుంది. ఈ క్షణాల్లో ఉన్నప్పుడు తక్షణమే ఆసుపత్రులకు తీసుకెళ్తే ఎటువంటి ప్రాణహాని ఉండదని వైద్యులు చెబుతున్నారు. పాము కాటుకు గురైన వారిని 99శాతం బతికించే అవకాశం ఉంటుందని వైద్యులు అంటున్నారు.

ఎమ్మెల్యే ధర్నా చేయడం విడ్డూరం



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూన్ 26: మూడు రోజుల క్రితం అందవెల్లి పెద్దవాగుబ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే హరీష్‌బాబు దీక్షలు చేయటం విడ్డూరంగా ఉందని సిర్పూరు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ రావిశ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వందరోజుల్లో వందకోట్ల నిధులు తెచ్చినట్టు చెప్పిన ఎమ్మెల్యే ఇప్పుడు ధర్నాకు దిగటం దారుణమన్నారు. పోడు రైతుల విషయంలో కూడా అన్యాయం చేయటం దారుణమన్నారు. ఎమ్మెల్యే, బాబాయ్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. పోడు రైతుల విషయంలో కూడా అన్యాయం చేయటం దారుణమన్నారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, ఎంపీపీ దుబ్బుల నానయ్య, జడ్పీటీసీ సభ్యుడు వెంకన్న, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరికలు



బీజేపీలో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

కాగజ్‌నగర్, జూన్ 26: కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి జీడిచేనుకు చెందిన పలువురు నాయకులు సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సమక్షంలో బీజేపీలో చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీజేపీలో చేరిన వారిలో నాయకులు కోట పోచయ్య, కార్యకర్తలున్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్, జూన్ 26: మండలంలో ఆయాపాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లుతున్న సందర్భంగా రాస్పెల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో వారికి సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఏపీసీ అధ్యక్షురాలు టేకం దేవి, ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, ఏటుకూరి శ్రీనివాస్ రావు, రవికుమార్, వార్ల ఉమేష్, ఇందారపు ప్రకాష్, దివ్యశ్రీ, మహిపాల్, గాయత్రీ, అప్సాట్ అహ్మద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వారసంతకు వేలం

కెరమెరి, జూన్ 26: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం వారసంతకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అంజద్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలో ప్రతిశనివారం నిర్వహించే వారసంతకు గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో కృష్ణమూర్తి ఒకప్రకటనలో తెలిపారు. అలాగే హుడ్కిలి నిర్వహించే పశువుల సంతకుకూడా వేలంపాట నిర్వహిస్తామని కార్యదర్శి హరి తెలిపారు. ఆసక్తిగలవారు పాల్గొనాలన్నారు.

కౌటాలలో రేపు..

కౌటాల: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఈనెల28న వారసంత, పశువులసంతకు వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

30న ఉచిత బస్‌పాస్ మేళా

కౌటాల, జూన్ 26: ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల30న దివ్యాంగులకు ఉచితబస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వికలాంగులసంఘం అధ్యక్షుడు ఇప్ప రవిశంకర్, మండలాధ్యక్షుడు రాజేష్, ఆర్టీసీ సిబ్బంది తులసీరాం ఒకప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని తయారు చేయాలి: జడ్జి ఎంవీ రమేష్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జడ్జీ ఎంవీ రమేష్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

ఆసిఫాబాద్, జూన్ 26: మాదకద్రవ్య రహిత సమాజం తయారు చేయాలని జిల్లా న్యాయమూర్తి ఎంవీ రమేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన మిషన్ పరివర్తన్‌లో భాగంగా జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ, ఎమెల్యే హరీష్‌బాబుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ యువత త్రీఎల్(లవ్, లస్ట్, లిక్కర్) పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు మాదకద్రవ్యాలు యువతపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయని అన్నారు. చదువు కంటే సంస్కారం గొప్పదని యువత సంస్కారం నేర్చుకోవాలన్నారు. కోర్టుకు వచ్చే అనేక కేసులు మాదక ద్రవ్యాలతో ముడిపడి నేరాలు చేస్తున్నవే అని గుర్తు చేశారు. మాదకద్రవ్యాలకు అలవాటైన వారికి దానిని మాన్పించేందుకు ప్రత్యేకంగా జిల్లాలో చికిత్సకేంద్రం ఉందన్నారు. వారిని రక్షించడానికి ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబరు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం మొదట సరదాగా మొదలై తరువాత అలవాటుగా మారి ప్రాణాన్నే హరిస్తుందన్నారు. జిల్లాలో అన్నిశాఖల సమన్వయంతో మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో 90శాతం నేరాలు సెల్‌ఫోన్లు, నార్కోటిక్స్ వాడడం వల్లనే జరుగుతున్నాయని అన్నారు. వాటిని నివారించగలిగితే నేరనియంత్రణ సాధ్యమవుతుందన్నారు. దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ దహెగాం మండలానికి చెందిన చిన్నారిపై జరిగిన అత్యాచార సంఘటనలో కూడా గంజాయి ప్రధానపాత్ర వహించిందని గుర్తుచేశారు.

ప్రజల్లో అవగాహన లేకపోవడంతో గ్రామాల్లో కూడా పెద్దఎత్తున మాదకద్రవ్యాలు దొరుకుతున్నాయని అన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి కుమరంభీం చౌక్, గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమ శాఖాధికారి భాస్కర్, డీఈవో అశోక్, డీఎస్పీ సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌కు పదోన్నతి



ప్రిన్సిపాల్ చక్రపాణి

కాగజ్‌నగర్, జూన్ 26: కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణికి పదోన్నతి లభించింది. నవోదయ విద్యాలయ సమితి పూణే శాఖలోని రీజినల్ ఆఫీసులో సహాయ సంచాలకుడిగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర విద్యాలయ నవోదయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 13ఏళ్లుగా కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదోన్నతి కోసం పరీక్షలు నిర్వహించగా దక్షిణ భారతదేశంలో ఉన్న 22నవోదయ పాఠశాలల నుంచి కాగజ్‌నగర్ ప్రిన్సిపాల్ చక్రపాణి ఒక్కరే ఎంపిక కావటం విశేషం. ఈనెల 28న ఆయన సహాయ సంచాలకులుగా పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు.

కలెక్టరేట్ ఎదుట మున్సిపల్, పంచాయతీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 26: జిల్లాలోని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు ఆరునెలలుగా వేతనాలు అందడం లేదని పెండింగ్‌లోఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దుచేసి పాతకేటగిరీలను కొనసాగించాలన్నారు. రూ.5 లక్షల ఇన్సురెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, కృష్ణమాచారి,మోరేశ్వర్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుట్కాను సమూలంగా రూపుమాపడమే లక్ష్యం

● ఎస్పీ డీవీ శ్రీనివాస్



పట్టుకున్న గుట్కాను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 26: జిల్లావ్యాప్తంగా గుట్కాను సమూలంగా రూపుమాపడమే లక్ష్యమని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలో అక్రమంగా నిలువ ఉంచిన రూ.8లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాను పట్టుకొని నిందితుడిని అరెస్టుచేసిన సందర్భంగా పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వెనకాల ఉన్న గోదాంలో నిషేధిత గుట్కా నిలువ ఉంచారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, పట్టణ సీఐ సతీష్, పోలీసు సిబ్బంది కలిసి తనిఖీలు చేయగా గోదాం లో రూ.8లక్షల విలువగల నిషేధిగుట్కా లభించిందన్నారు. గుట్కాను నిలువ ఉంచి విక్రయిస్తున్న మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాకు చెందిన అమిత్ కట్కంవార్‌ను అరెస్టుచేసి కేసు నమోదు చేశామన్నారు. గుట్కా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ ఎస్సై గంగన్న, కాని స్టేబుల్ సంజీవ్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ సదయ్య, సీఐ సతీష్, ఎస్సై రాజేశ్వర్, ప్రవీణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి

● ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనిచేయని ఎనిమిది లిఫ్టు ఇరిగేషన్లు ● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సాండ్‌గాం ఎత్తిపోతల పథకాన్ని సందర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల, జూన్ 26: మండలంలోని తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించాలని, ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ఉన్న ఎనిమిది లిఫ్టు ఇరిగేషన్లకు మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాండ్‌గాం, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల పథకాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2006లో ప్రాణహిత నది ఒడ్డున సాండ్‌గాంతోపాటు వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి ఇతర ప్రాంతాల్లో ఎనిమిది లిఫ్టు ఇరిగేషన్‌లను నిర్మించారన్నారు. అందులో ఒక్కటి కూడా పనిచేయడం లేదన్నారు. దీంతో ఈప్రాంత రైతులు చుట్టు నీళ్లఉన్నా వర్షంపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఒక్క సాండ్‌గాం లిఫ్టుఇరిగేషన్ కింద అయిదువేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. లిఫ్టుఇరిగేషన్‌ల మోటార్లు చెడిపోయి అయిదేళ్లు గడుస్తుందని, వాటిని మరమ్మ తులు చేయక, కొత్త మోటారు పెట్టక నాలుగైదు సంవత్సరాలు గడుస్తోందన్నారు. లిఫ్టు ఇరిగేషన్ మర మ్మతులకు కావాల్సిన సగం ఖర్చులను రైతులు భరించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉత్తంకుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఫామ్‌హౌజ్‌లో ఒక్క రోజు చేసుకునే విందు ఖర్చుతో ఈ లిఫ్టు ఇరిగేషన్‌లు మరమ్మతు చేయవచ్చన్నారు. పాలకులు రైతుల కోపానికి భస్మం అయిపోతారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఈ ప్రాంతరైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లిఫ్టుఇరిగేషన్‌లకు మరమ్మతులు చేయించకపోతే పార్టీలకు అతీతంగారైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నాకు దిగుతామన్నారు. ఆయనవెంట నాయకులు శంకర్, రాజ్‌కుమార్,శ్యాంరావు,మంగేష్,బండు తదితరులున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



ఎక్స్‌కవేటర్‌తో పూడిక తొలగిస్తున్న అధికారులు

కెరమెరి, జూన్ 26: మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లో వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఆదివాసీభవన్ పక్కన ఒర్రెలో ఎంపీడీవో అంజద్‌పాషా ఆధ్వర్యంలో చెట్లను, పూడికను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతీరాం, కార్యదర్శి భీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహూ మహారాజ్ జయంతి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 26: ఛత్రపతి సాహూ మహారాజ్ జయంతిని పట్టణంలోని ఆరె సంక్షేమ సంఘభవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆరెసంఘం నాయకులు జైరాం,బిక్కాజీ,గోపాల్,తిరుపతి, మారుతి, దిలీప్, సంతోష్‌కుమార్,రవి,రాజు,మనోహర్, పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 26: ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీససౌకర్యాలు కల్పించాలని, ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన పాఠశాలల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేటుపాఠశాలలను మూసివేయించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కృష్ణ, ప్రణయ్, శ్రావణ్,రోహిత్,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను ఇవ్వాలి

వాంకిడి, జూన్ 26: కల్యాణలక్ష్మి చెక్కులను సకాలంలో అందించాలని డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 2023సంవత్సరానికి సంబంధించిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే చెక్కులు అందజే యాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఈపీ ఆపరేటర్ల డిప్యూటేషన్లు రద్దు చేయండి

శ్రీరాంపూర్, జూన్ 26: ఈపీ ఆపరేటర్లను మణుగూరుకు డిప్యూటేషన్‌పై పంపే సర్క్యులర్‌ను రద్దుచేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఆపరేటర్లు ఇప్పటికే తమ పిల్లలను వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించారని, ఇప్పుడు వారు బదిలీపై వెళ్లాలంటే కుటుంబపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. వెంటనే సర్క్యులర్‌ను వెనక్కితీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్తకార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, నాయకులు బద్రి బుచ్చయ్య, గుండి సతీష్, ఇట్టినేని శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జనరల్ బాడీ సమావేశం

శ్రీరాంపూర్, జూన్ 26: సింగరేణికోల్‌మైన్స్ కార్మిక్‌సంఘ్ (ఎబీకేఎంఎస్-బీఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియాకమిటీ జనరల్‌బాడీ సమావేశం శుక్రవారం సాయంత్రం 5గంటలకు నస్పూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు బీఎంఎస్ ఏరియాకార్యదర్శి నాతాడిశ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎబీకేఎంఎస్ ఇంటర్నల్ ఆడిటర్ మంద రమాకాంత్, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ హాజరవుతారని, శ్రీరాంపూర్ ఏరియా కార్యకర్తలు, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 26: కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు ఆయన ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌తో కలిసి సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రెండునెలలుగా కన్వేయన్స్‌డ్రైవర్లకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సీఎంపీఎఫ్ డబ్బులు కూడా చెల్లించడం లేదని ఆరోపించారు. భూ నిర్వాసితులకు కన్వేయన్స్ వాహనాలు పెట్టుకునేందుకు టెండర్ వేస్తే కొంతమంది దళారులు టెండర్ పొందుతున్నారన్నారు. సంబంధిత టెండర్లను భూనిర్వాసితుల కుటుంబాలకు, సింగరేణిలో ఉండే నిరుద్యోగ యువతకు ఇవ్వాలని, కన్వేయన్స్ డ్రైవర్లకు వేతనాలు, సీఎంపీఎఫ్ చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్‌లో పలువురి చేరిక

శ్రీరాంపూర్, జూన్ 26: సింగరేణి కోల్ మైన్స్ కార్మిక్ సంఘ్(ఎబీకేఎంఎస్-బీఎంఎస్)లో బుధవారం పలువురుకార్మికులు చేరారు. ఈ సందర్భంగా వారికి కేంద్రకార్యదర్శి చాట్ల అశోక్, ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు తలారి వినయ్, మిట్టపల్లి మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలి

శ్రీరాంపూర్, జూన్ 26: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ3 గనికి కేటాయించిన 6నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను గని మేనేజర్ సంతోష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రక్షణాధికారి శ్రీధర్, పిట్‌కార్యదర్శి మురళీ చౌదరి, సంక్షేమాధికారి గౌస్‌పాషా, పిట్ ఇంజనీర్ ప్రేమ్ కుమార్, సాయి శ్రవణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 26: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీవీ శ్రీనివాసరావును బుధవారం జిల్లాలోని గోండ్వానా పంచాయతీ, రాయిసెంటర్, రాజ్‌గోండ్ సేవాసమితి ఆదివాసీసంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది తెగల ఆదివాసీలు నివసిస్తున్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలను కాపాడా లని కోరారు. ఎజెన్సీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, అర్జుమాస్టర్, సుధాకర్, మోతీరాం, యశ్వంతరావు, రఘు, నర్సింగ్‌రావు, జ్ఞానేశ్వర్, సూరు మాస్టర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

ఆసిఫాబాద్, జూన్ 26: ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మెనోటీసు అందజేసి నెల రోజులు గడుస్తున్నా చర్చలకు పిలవకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం బస్టాండు ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అద్దె బస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లను ఆర్టీసీ యజమాన్యం, ప్రభుత్వం శ్రమదోపిడీకి గురిచేస్తుందని ఆరోపించారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీనాయకులు ఉపేందర్, మధుసూదన్, షఫి, సాయికృష్ణ, అంజి, నానాజీ, సంతోష్, విజయ్, కృష్ణ, మొండి, వినోద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభంపై నిర్లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

ఏసీసీ, జూన్ 26: బసంత్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని బసంత్‌నగర్ బ్రిడ్జి వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ రహదారి నిర్మాణం పూర్తయి పదేళ్లు దాటినా ఇంకా బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రారంభం చలేదని ప్రశ్నించారు. త్వరగా బ్రిడ్జిని ప్రారంభించి మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.


రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

● హామీల అమలులో విఫలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. పట్టణంలోని అగర్వాల్ భవన్‌లో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి భారీగా బీజేపీకి ఓట్లు రావడం సంతోషకరమని తెలిపారు. 200 రోజులు దాటినా ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నెరవేరని హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. అనంతరం బూత్‌లలో అధిక మెజార్టీ వచ్చిన బూత్ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రజనీష్ జైన్, పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్, శ్రీకృష్ణదేవ రాయలు, కళ్యాణి, విజయ్, శ్రీనివాస్, సంపత్, ప్రదీప్, నాయకులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

మంచిర్యాల అర్బన్, జూన్ 26: మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, గోదావరి సమీపంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తాచెదారం, బయోవేస్ట్ కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి మినీ డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. దీంతో ఆస్పత్రుల ఆవరణ అంతా అపరిశుభ్రంగా మారడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కంటి వైద్య శిబిరం పోస్టర్ల విడుదల

చెన్నూరు, జూన్ 26: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మడేకర్ చారిటబుల్ కంటి ఆసుపత్రి కరీంనగర్, గర్మిళ్ల లైన్స్ క్లబ్ మంచిర్యాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్లను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెనూనరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సాయి , వైస్ చైర్మన్ నవాజుద్దీన్, లయన్స్‌క్లబ్‌సభ్యుడు వెంకటేశ్వర్, కౌన్సిలర్లు మహేష్, సుధాకర్, శ్రీను, శ్రీనివాస్, శారద, స్రవంతి, సురేఖ, శాంతారాణి, కో ఆప్షన్ సభ్యు డు మహ్మద్ ఆయుబ్, శ్రీనివాస్, సామాజిక నాయకులు తిరుపతి, వెంకటనరసయ్య, సురేష్‌రెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

జైపూర్, జూన్ 26: మండలంలోని ఇందారం గ్రామం లోని తంగళ్లపల్లి మల్లేశ్వరికి చెందిన బర్రె టేకుమట్ల గ్రామ శివారులో విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. మంగళవారం మేతకు వెళ్లిన బర్రె ఇంటికి తిరిగి రాకపోవడంతో బుధవారం టేకుమట్ల గ్రామ శివారులో గాలిస్తుండగా కరెంటు స్తంభాల తీగల నేలపై వేలాడుతూ ఉండడంతో బర్రె విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందిందని తెలిపారు. మృతిచెందిన బర్రె విలువ సుమారు రూ. 85 వేలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని కోరాడు.

జిల్లా అధికారుల సొసైటీ కార్యవర్గం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 26: మంచిర్యాల జిల్లా అధికారుల హౌస్ బిల్డింగ్ మ్యుచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన జిల్లాఅధ్యక్షుడు చాతరాజుల దుర్గా ప్రసాద్(ఎస్సీ కార్పొరేషన్ ఈడీ) తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతన ప్రధాన కార్యదర్శిగా డీఆర్‌డీవో కిషన్, కోశాధికారిగా జిల్లా వయోజన విద్యాశాఖ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం, ఉపాధ్యక్షుడుగా జెడ్పీ సీఈవో గణపతినాయక్, ఆర్ శైలజ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డీపీవో వెంకటేశ్వర్‌రావు, చిన్నయ్య, సంయుక్త కార్యదర్శులుగా డీఈవో యాదయ్య, జిల్లామైనార్టీ శాఖ అధికారి రాజేశ్వరి, గంగారాం, తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి , స్వామిరెడ్డి, శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా హరనాథ్, రాజ్‌వీరు, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, ఉదయ, గజానంద్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

భీమిని, జూన్ 26: కత్తితో దాడి చేసిన కేసులో మండల కేంద్రానికి చెందిన సర్దార్ సాహెబ్‌హుస్సేన్‌కు బుధవారం మంచిర్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1200 జరిమానా విధించారని భీమిని ఎస్సై విజయ్ తెలిపారు. 2015 ఆగస్టు 6న మామిడిపల్లికి చెందిన టార్రె నరేష్‌కు, చికెన్ సెంటర్ యజమాని సాహెబ్‌హుస్సేన్‌తో చికెన్ కొనే విషయంలో గొడవ జరిగిందన్నారు. కోళ్లు కోసే కత్తితో నరేష్‌పై సాహెబ్‌హుస్సేన్ దాడి చేయడంతో కంఠం, ఎడమ చెంపపై గాయాలయ్యాయని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎన్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారని చెప్పారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్ సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువైందన్నారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ శిక్ష ఖరారు చేశారని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హాజీపూర్, జూన్ 26: మండలంలోని గుడిపేటలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంనూర్ గ్రామానికి చెందిన దేవి సత్యనారాయణ(43) అనే వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..ఇదే గ్రామానికి చెందిన కారుకూరి తిరుపతితో కలిసి సత్యనారాయణ ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుడిపేట వద్దకు రాగానే వెనకాల నుంచి లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతికి స్వల్ప గాయాలు కాగా, వెనకాల కూర్చున్న సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో మంచిర్యాల లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందినట్లు తెలిపారు. సత్యనారాయణ అన్న దేవి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సిర్పూర్(టి)లో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తి, అధికారులు, విద్యార్థులు. కౌటాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ, ఎస్సైలు

దహెగాం/చింతలమానేపలి/పెంచికలపేట/కౌటాల/వాంకిడి/కెరమెరి/రెబ్బెన/బెజ్జూరు, జూన్ 26: విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. దహెగాంలో ఎస్సై రాజు, చింతలమానేపల్లిలో ఎస్సైనరేష్, పెంచికలపేటలో ఎస్సై కొమురయ్య, కౌటాలలో సీఐ సాదిక్‌పాషా, వాంకిడిలో సీఐ శ్రీనివాస్, కెరమెరిలో ఎస్సై విజయ్‌కుమార్, రెబ్బెనలో సీఐ చిట్టిబాబు డ్రగ్స్ వినియోగిస్తే కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. వాటికి ఎంతదూరం ఉంటే అంత మంచిదన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని అన్నారు. ప్రభుత్వప్రైవేటుపాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని బెజ్జూరు జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

కాగజ్‌నగర్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలకు బానిస కావద్దన్నారు. యువత ఉన్నతలక్ష్యాలతో ముందుకు పోవాలన్నారు. సమావేశంలో సీఐ శంకరయ్య, ఎస్సై అంసన్న, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి
- సిర్పూర్(టి) న్యాయమూర్తి అజయ్

సిర్పూర్(టి): మాదకద్రవ్యాలను అరికట్టాలని సిర్పూర్(టి) న్యాయమూర్తి అజయ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోర్టు నుంచి పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు మహమ్మారిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌రావు, శంకర్‌రావు, న్యాయవాదులు కళ్యాణ్, గణపతి, శ్రీనివాస్, ఎస్సై దీకొండ రమేష్, ఎక్సైజ్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై రైతులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 26: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ సహకారసంఘ కార్యాలయంలో రైతులకు ఇండియన్ ఫార్మర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్‌సీఓ) నానో యూరియా, నానో డీఏపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్‌అహ్మద్, ఏవో ఖాదర్‌హుస్సేన్ మాట్లాడుతూ ఇఫ్కో నానో యూరియా, నానో డీఏపీ వాడడం వల్ల తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఫలితాలు వస్తాయని అన్నారు. అన్నిరకాల ఎరువులు ద్రవరూపంలోనే వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని వాడడంవల్ల మొక్క ఆకుల ద్వారా పీల్చుకొని ఎరువు వృథా కాకుండా ఉంటుందని, భూమి కలుషితం కాకుండా కాపాడగలమని అన్నారు. రైతుల అనవసర ఖర్చులు తగ్గి లాభసాటిగా వ్యవసాయం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇఫ్కోడీఎం బాలవికాస్ రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, ఏఈవోలు, సీఈవో రమణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో ఖాదర్‌హుస్సేన్

కేంద్ర గిరిజనశాఖ మంత్రిని కలిసిన నాయకులు

లింగాపూర్, జూన్ 26: ఢిల్లీలో గిరిజన శాఖా కేంద్రమంత్రి జోల్‌ఓరమ్‌ను లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలిక ఈశ్వర్‌సింగ్, చవాన్ గుణవంత్‌రావు, భూక్యా పాపానాయక్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందించినట్లు వారు తెలిపారు. పోడు భూములకు శాశ్వతపట్టాలు ఇవ్వాలని, గిరిజన గ్రామాల్లో గురుకులాలు, ఏకలవ్య, ఆశ్రమపాఠశాలలు మంజూరు చేసి గిరిజన ప్రాంతాలను విద్యాపరంగా అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

గుట్కా పట్టివేత

చింతలమానేపల్లి, జూన్ 26 : మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న గుట్కాలను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రవీంద్రనగర్-1 గ్రామంలోని పీకే బాలు కిరాణాదుకాణంలో అక్రమంగా గుట్కా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించగా రూ.4,210విలువ గల గుట్కాలు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబంధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చేకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం కాదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్ప కళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయ్యుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కాహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

ఉజ్వల భవిష్యత్‌కు పాలిటెక్నిక్

- ఉపాధితో పాటు ఉన్నత విద్యకు డిప్లొమా భరోసా
- పాలిసెట్ ద్వారా సీట్ల కేటాయింపు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

పదో తరగతి తరువాత పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఈ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. ఇందులో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి దొరుకుతోంది. కళాశాలల్లోనే ఆయా కంపెనీలు ఉద్యోగ మేళాలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నాయి.

బెల్లంపల్లి, జూన్ 26: పదో తరగతి తరువాత ఉన్న దారుల్లో పాలిటెక్నిక్ కోర్సులు చెప్పుకోదగ్గవి. ఉపాధి, ఉద్యోగం ఉన్నత చదువులు అన్నింటికీ సరిపోయేలా వీటిని రూపొందించారు. సాధారణ డిప్లొమాలతో పాటు వ్యవసాయం, ఉద్యానవనం, వెటర్నీల్లో రెండేళ్ల వ్యవధితో పాటు తెలుగు మాధ్యమంలోనూ పాలిటెక్నిక్‌లు ప్రత్యేక కోర్సులను అందిస్తున్నాయి. ఇవే కాకుండా జాతీయ స్థాయి సంస్థలు ప్రత్యేక విభాగాల్లో డిప్లొమాలు నిర్వహిస్తున్నాయి. ఇవి పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

500 మందికి పైగా విద్యార్థులు

బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ఈఐ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఈఈ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మైనింగ్ కోర్సులు ఉన్నాయి. అలాగే వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మెటలర్జీ కోర్సు, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు సైతం ఉంటాయి. ఈ కళాశాలలో ఆయా కోర్సుల్లో దాదాపు 500 మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా యేటా వేల సంఖ్యలో పదో తరగతి పరీక్ష రాసి ఉత్తీర్ణులవుతున్నారు. కొందరు విద్యార్థులు ఇంటర్ విద్య వైపు అడుగులు వేస్తుండగా మరికొందరు పాలిటెక్నిక్ వైపు అడుగులు వేస్తున్నారు. పాలిటెక్నిక్ కళాశాలలోని కోర్సులతో ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కాగా అంత రిక్ష పరిశోధన సంస్థ, విద్యుత్, శాటిలైట్, కృత్రిమ అవయవాల తయారీ, స్టీల్ ప్లాంట్లలో ఉపయోగించే వస్తువుల తయారీలో ప్రధానమైంది మెటలర్జీ ఇంజనీరింగ్ కోర్సు. దీంతో పాటు ఇతర లోహాలను వినియోగించుకుని అవసరమైన ఉత్పత్తులను తయారు చేయడమే ఈ కోర్సు ప్రత్యేకత.

ఈసెట్‌తో నేరుగా..

డిప్లొమా అనంతరం ఉన్నత విద్య దిశగా అడుగులు వేయాలనుకున్న వాళ్లు ఈసెట్‌తో నేరుగా బీటెక్ రెండో సంవత్సరం కోర్సుల్లో చేరిపోవచ్చు. ఎం సెట్ ఐఐటీ-జేఈఈ సైతం రాసుకోవచ్చు. డిప్లొమా అర్హతతో ఉద్యోగంలో చేరినవాళ్లు ఇంజనీర్స్ ఇన్ స్టిట్యూషన్ అందించే బీటెక్‌తో సమాన మైన అసో సియేట్ మెంబర్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఏఎంఐఈ) పూర్తి చేసుకోవచ్చు. అనంతరం ఎంటెక్ దిశగానూ అడుగు వేసే అవకాశం ఉంటుంది.

మంచి ఉద్యోగ అవకాశాలు..



రవీందర్, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

పాలిటెక్నిక్ కళాశాలలోని వివిధ కోర్సులతో మంచి ఉద్యోగావకాశాలు వస్తాయి. పాలిటెక్నిక్ కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కోర్సులు పూర్తి చేసిన అనంతరం ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. కోర్సుల అనంతరం నెలకు రూ. 1.50 లక్షల నుంచి 3 లక్షల వరకు ప్యాకేజీ పొందిన విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి.



కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు..

తెలంగాణ రాష్ట్రంలో కెమికల్ ఇంజనీరింగ్ కోర్సును అందిస్తున్న ఏకైక కళాశాల రామాంతాపూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల. ఈ కోర్సులో చేరాలనుకునేవారు పదో తరగతి ఉత్తీర్ణులైన పాలిసెట్ ప్రవేశ పరీక్ష 2024లో ఉత్తీ ర్ణులై ఉండాలి. ఈ కోర్సు మూడేండ్లు ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ కోర్సులో 60 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు.కోర్సు పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు ఈ సెట్ రాసి లేటరల్ ఎంట్రీతో బీటెక్ రెండో సంవత్సరం చదవచ్చు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు కెమికల్స్ సంబంధిత పరి శ్రమలు, పెట్రో కెమికల్స్, ఎరువులు, ఫార్మా, ఉప్పు, సిమెంటు, పేపరు,ప్లాస్టిక్ తదితర కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. కెమికల్ ఇంజనీరింగ్ కోర్సుతో మనం నిత్యం ఉపయోగించే ప్రతి వస్తువు తయారీలో కెమికల్ ఇంజనీరింగ్ పాత్ర కీలకంగా ఉంటుంది. కెమెస్ట్రి, ఫిజిక్స్, మ్యాథ మేటిక్స్, బయోలజీ ఉండే అంశాలను ఉపయోగిం చుకుని ముడి పదార్థాల నుంచి మనకు అవసరమైన ఉత్పత్తుల తయారీకి కావాల్సిన ప్రక్రియను ఈ కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులో తెలుపుతారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, జూన్ 26: కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని బుధ వారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రిని కలిసి పలు విషయాలపై చర్చించారు.

2న వాహన సామగ్రి వేలం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 26: జిల్లాలోని గుడిపేట తెలంగాణ ప్రత్యేక పోలీసు 13 బెటాలి యన్‌లో వినియోగించిన వాహనాల సామగ్రికి జూలై 2వ తేదీన ఉదయం 10 గంటలకు బెటాలియన్‌లో వేలం నిర్వహించనున్నామని బెటాలియన్ కమాండెంట్ జమీన్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత టైర్లు,ట్యూబులు, పాత బ్యాటరీలు, వినియోగించిన ఇంజన్ ఆయిల్, పాత స్పేర్ పార్ట్‌కు వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

నెన్నెల, జూన్ 26: గంగారం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ కార్యదర్శి జాడి రాజ్‌కుమార్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కరెంటు కోతలు విధించొద్దు

- జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మిఓదెలు


సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

మందమర్రిరూరల్, జూన్ 26: అకారణంగా కరెంటు కోతలను విధించవద్దని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మిఓదెలు విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. విద్యుత్ అధికారులు వేలాపాళా లేకుండా కరెంటు కోతలు విధించవద్దని జడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. మండల కో ఆప్షన్ సభ్యుడు నసీరుద్దీన్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని పలుమార్లు తీర్మానం చేసినా అధికారులు స్పందించడం లేదని తెలిపారు. మండలంలోని మామిడిగట్టు గ్రామానికి చెందిన నెన్నెల మండలం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందని, మందమర్రి నుంచే మామిడిగట్టుకు విద్యుత్ సరఫరా చేయాలని సభ్యులు కోరారు. పొన్నారం, సారంగపల్లి , ఆదిల్‌పేట గ్రామాల్లో హరితహారంలో భాగంగా లక్ష మొక్కలను నాటుతామని ఫారెస్టు అధికారులు తెలిపారు. సారంగపల్లి తదితర గ్రామాల్లోని గ్రామస్తులకు ఏదైనా మెడికల్ ఎమర్జన్సీ ఏర్పడితే 108 అంబులెన్స్ వచ్చే వరకు ఆలస్యం అవుతుందని, స్థానిక కేకే 1 డిస్పెన్సరీలో బాధితులకు ఫస్ట్ ఎయిడ్ అందించే విధంగా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకోవాలని సభ్యులు తెలిపారు. జడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు చివరి సమావేశం కావడంతో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేల్పుల రవి, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో బీరయ్య, వైస్ ఎంపీపీ లౌడం రాజ్‌కుమార్, ప్రభాకర్‌రావు, ఏపీఎం లలితకుమారి, కార్యాలయం సూపరింటెండెంట్ బాల కిషన్, శ్రీనివాస్ యాదవ్, రవీందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ సేవలు అభినందనీయం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 26: అదనపు కలెక్టర్‌గా పనిచేసి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం ప్రాజెక్టు అధికారిగా పదోన్నతిపై వెళ్లిన రాహుల్ జిల్లాకు విశిష్ట సేవలందించారని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ కొనియాడారు. బుధవారం కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి హాజరై రాహుల్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అదనపు కలెక్టర్‌గా రాహుల్ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కార్యాలయాల సముదాయంలో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాహుల్ భద్రాచలం ఐటీడీఏ పీవోగా బదలీపై వెళ్లిన సందర్భంగా బుధవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, రామ్మోహన్, శ్రీపతి బాపురావు, తిరుపతి, రాంకుమార్, సునీత, శ్రావణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ కుమార్‌దీపక్



మంచిర్యాలలో సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ఏసీసీ, జూన్ 26: మంచిర్యాలను మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చి దిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు నిర్వహించిన ర్యాలీలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి పాల్గొన్నారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగాలను నిరోధించడంలో భాగంగా మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు , గంజాయి, ఇతరత్రా మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అసాధారణ ప్రవర్తన కలిగిన విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకురావాలన్నారు. . డ్రగ్స్‌కు అలవాటు పడి చికిత్స కోసం వచ్చిన వ్యక్తులను గుర్తించి అలాంటి వారి నుంచి పూర్తిసమాచారాన్ని రాబట్టి పూర్తి చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లు విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. మత్తు పదార్థాలు నిల్వ ఉన్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 14446, 8712671111 సమాచారం అందించాలన్నారు. అనంతరం ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ పాయింట్‌లో కలెక్టర్ ఫొటో దిగారు. అనంతరం పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ర్యాలీలో పాల్గొన్న వారితో మాదకద్రవ్య నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, డీఈవో యాదయ్య, ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి నందగోపాల్, డీఐఈవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: మాదక ద్రవ్యాలు తీసుకోవడం ప్రాణాంతకమని వాటికి ఒకసారి అలవాటు పడితే మానుకోవడం సులువు కాదని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి జీఎం మనోహర్‌లు అన్నారు. మాదక ద్రవ్య నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో నిర్వహిం చిన ర్యాలీకి వారు అతిథిలుగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలను విక్రయించినా, వినియోగించిన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఏరియాలోని కేకే 5 గనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఎస్ఐ రాజశేఖర్, గని మేనేజర్ అల్లావుద్దీన్,సంక్షేమాధికారి మాస్కుల కార్తీక్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు,

బెల్లంపల్లి: యువత మాదక ద్రవ్యాల బారిన పడవద్దని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. బెల్లంపల్లి పట్టణంలో జడ్పీఎస్ఎస్ బజార్ ఏరియా పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు దేవయ్య, అఫ్జలొద్దీన్, ఎస్ఐలు రమేష్, నరేష్, రమేశ్ పాల్గొన్నారు.

జైపూర్: మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యమని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో సీఐ మోహన్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, రెండో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. జైపూర్ మెడికల్ ఆఫీసర్ ముస్తఫా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి సింధూర, ఫార్మాసిస్టు చంద్రయ్య, సూపర్ వైజర్ శోభారాణి పాల్గొన్నారు.

లక్సెట్టిపేటరూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాల నిర్మూలన కోసం పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతుందని లక్సెట్టిపేట సీఐ నరేదర్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో లక్సెట్టిపేట పట్టణంలో బుధవారం యువత, విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పతిలో వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది డ్రగ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట ఎస్ఐ చంద్రకుమార్, ఎస్ఐ 2 రామయ్య తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ రవికుమార్

హాజీపూర్: మండలంలోని ముల్కల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు గణపతిరెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హాజీపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ ఎస్ఐ సురేష్ ఉపాధ్యా యులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, హెచ్ఈవో రఘుపతి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, సీహెచ్‌వో జయమేరి, హెచ్ఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ సంతోష్, నస్పూర్ ఎస్ఐ రవి కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీరాంపూర్‌లోని ఐటీఐలో, సీసీసీలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీరాంపూర్, సీసీసీ పోలీస్ సిబ్బంది, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసులు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపలి: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల చేత మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై లింగంపల్లి భూమేష్, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

మందమర్రిరూరల్(కాసిపేట): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దేవాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ధర్మారావుపేట ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మందమర్రిలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్ఐ రాజశేఖర్ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జన్నారం: మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఎస్ఐ రాజవర్ధన్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

భీమారం: మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.


లక్సెట్టిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



జైపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఏసీసీ, జూన్ 26: జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీలోని మాస్టర్స్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడి యంలో గురువారం నుంచి 30వ వరకు నిర్వహించనున్న యూనిక్ సన్ రైజ్ సీనియర్స్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాపు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరి సుధాకర్ అన్నారు. బుధవారం స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోర్నమెంట్‌కు అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 27న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు, 30 వరకు మెయిన్ డ్రా మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న ఉదయం టోర్నమెంట్ ప్రారంభోత్సవం ఉంటుందని, 30న బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మ్యాచ్ కంట్రోలర్ కుమార్, అసోసియేషన్ కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, వాసు, మీనారెడ్డి, రమేష్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మంచిర్యాల అర్బన్, జూన్ 26: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. తెరిచి ఉన్న పాఠశాలలను ఆ సంఘం నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు అజయ్, నాయకురాలు మామిడి అక్షిత మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, సతీష్, నవీన్, సాయి, శశి, సందీప్, రోహిత్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు లకావత్ ఈశ్వర్ నాయక్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యాసంస్థలను మూసివేయించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకోవాలి

మంచిర్యాల అర్బన్, జూన్ 26: ఇటీవల విడుదలైన 72 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో తమకు అవకాశం కల్పించాలని బుధవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గత 17 సంవత్సరాలుగా ఆసుపత్రిలో ఎన్నో విపత్కర పరిస్థితుల్లో పని చేశామని, ఇటీవల పోస్టుల భర్తీలో తమ 9మందిని విధుల్లోకి తీసుకోకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కార్యక్రమంలో గుండా విజయ్‌కుమార్, కొల్లూరి గాయత్రి, కాశెట్టి మధుకర్, వేల్పుల రవీందర్, మంతెన అశ్విన్‌కుమార్, చింతపండు సంతోష్, మానస, కుమ్మరి శంకర్, మిన్నపూరి సంపత్ పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలి


మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

చెన్నూరు, జూన్ 26: చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు పట్టణంలో కోతుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు శ్రీనివాస్, జాడి సురేఖ, గర్రెపల్లి శాంతరాణి, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కోతుల బెడదను తీర్చేందుకు గతంలో రూ. 90 వేలను కేటాయించి తీర్మానం పట్టణంలో విద్యుత్ దీపాలకు సంబంధించిన మరమ్మతులకు నూతన లైట్లు పెట్టాలని కోరగా ఏఈని పిలింపిచిస్థానిక అవసరాలకు ప్రతీ రోజు గంట చొప్పున ఎల్‌సీ ఇవ్వాలని కోరడంతో ఏఈ తప్పకుండా ఇస్తామని తెలిపారు.

బహుజనులు అన్ని రంగాల్లో రాణించాలి

లక్సెట్టిపేటరూరల్, జూన్ 26: బహుజనులు, అంబేద్కరిస్టులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తొగరు రాజు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరిప్రేమ్‌చంద్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో దమ్మనారాయణ, చిప్పకుర్తి నారాయణ, చిన్నయ్య, పురుషోత్తం, రమేష్, రమేష్, లింగన్న, రవీందర్, సుధాకర్, శ్రీదర్,ప్రేమ్, సాగర్, ప్రసాద్, సత్తయ్య, ప్రసాద్,నరేష్, శాంతికుమార్, ప్రేంసాగర్, ఏసన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పెన్షనర్ల సంఘం సన్మానం

మంచిర్యాల అర్బన్, జూన్ 26 : మంచిర్యాల కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్‌ను బుధవారం టీజీఆర్‌ఈఏ (పెన్షనర్ల సంఘం సభ్యులు) యూనిట్, జిల్లా శాఖ సభ్యులు మార్యదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డి కృష్ణ, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి జగన్, కోశాధికారి వైకుంఠం, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, పాపారావు, యూనిట్ అధ్యక్షుడు కనకయ్య, అజీమోద్దీన్, రాజనర్సు, నగరస్వామి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి భూమి విరాళం

దండేపల్లి, జూన్ 26: దండేపల్లి మండలం కర్ణపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మించనున్న భవనానికి సరిపడా స్థల లేకపోవడంతో స్థానికుడు అజ్మీర హరిరామ్‌నాయక్ తన రెండు గుంటల భూమిని పాఠశాల భవనం కోసం విరాళం అందజేశారు. బుధవారం సర్వశిక్ష అభియాన్ ఏఈ వినయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజ్మీర శివకుమార్, కాంట్రాక్టర్ బొయిడి వెంగళ్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి రాజన్న సందర్శించారు, ఈసందర్భంగా హరిరామ్‌నాయక్‌ను గ్రామస్థులు అభినందించారు.

పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలి

మందమర్రిటౌన్, జూన్ 26: సింగరేణి ఉద్యోగులకు పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని, ఏరియా జీఎంమనోహర్ సూచించారు. బుధవారం పట్టణంలోని చతాలపూర్ వద్ద నీటి పైపులైన్‌ల పురోగతిని, కేకే 5 ఫిల్టర్ బెడ్ స్థితి గతు లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సివిల్ డీజీఎం శ్రీనివాసులు, డీఎస్ఈ శ్రీధర్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన అర్జున్‌కుమార్

మందమర్రిటౌన్, జూన్ 26: కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. యూత్ కాంగ్రెస్ భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలను వివరించినట్లు అర్జున్ తెలిపారు.

25 అంశాలపై తీర్మానం

చెన్నూరు, జూన్ 26: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనగిల్డా అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో మొత్తం 25 అంశాలపై తీర్మానం చేశారు. వాటర్ ట్యాంకర్‌కొనుగోలు, నీటి సరఫరా కోసం బతుకమ్మ వాగు నుంచి నూతన పైపులైన్ నిర్మాణం, వార్డుల్లో డ్రైనేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను తీర్మానించి ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు హాజరు కాని ఇద్దరి అరెస్టు

మంచిర్యాల అర్బన్, జూన్ 26: వరకట్న వేధింపుల కేసులో కోర్టు వాయిదాలకు హాజరు కాని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మహిళ పోలీస్ స్టేషన్ సీఐ రాజమౌళి గౌడ్ తెలిపారు. 2018లో వరకట్నం నమోదైన వరకట్న వేధింపుల కేసులో నిందితులైన లక్సెట్టిపేట మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రామీల ప్రసాద్, అతని తల్లి రామీల రాజమ్మ కొన్ని రోజులుగా కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారని, ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.